"మురళి సారము"

23-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మౌనముగా ఉండటము కూడా చాలా గొప్ప గుణము, మీరు మౌనముగా ఉంటూ తండ్రిని స్మృతి చేస్తూ ఉన్నట్లయితే చాలా సంపాదనను జమ చేసుకుంటారు"**

**ప్రశ్న:-** కర్మ సన్యాసాన్ని ఏ మాట ఋజువు చేస్తుంది, ఆ మాటను మీరు మాట్లాడలేరు?

**జవాబు:-** డ్రామాలో ఉంటే చేస్తాములే - బాబా అంటారు, ఇది కర్మ సన్యాసము అయినట్లు. మీరు కర్మలైతే తప్పకుండా చేయాలి. పురుషార్థము లేకుండానైతే నీరు కూడా లభించదు, అందుకే డ్రామా అని అంటూ వదిలేయకూడదు. కొత్త రాజధానిలో ఉన్నత పదవిని పొందాలంటే బాగా పురుషార్థము చేయండి.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. ఏ దేహధారి నామ-రూపాలలోనూ చిక్కుకోకూడదు. ఒక్క తండ్రి శ్రీమతముపై నడుస్తూ సద్గతిని పొందాలి. మౌనముగా ఉండాలి.
2. భవిష్య 21 జన్మల కోసం మంచి రీతిలో చదువుకోవాలి మరియు ఇతరులను చదివించాలి. చదువుకోవడము మరియు చదివించడముతోనే పేరు ప్రసిద్ధమవుతుంది.

**వరదానము:- మన్మతాన్ని, పరమతాన్ని సమాప్తము చేసి శ్రీమతము ఆధారముగా పదమాల సంపాదనను జమ చేసుకునే పదమాపదమ భాగ్యశాలీ భవ**

శ్రీమతముపై నడిచేవారు ఒక్క సంకల్పాన్ని కూడా మన్మతము లేక పరమతము ఆధారముగా చెయ్యలేరు. స్థితి యొక్క స్పీడ్ ఒకవేళ తీవ్రముగా లేకపోతే తప్పకుండా శ్రీమతములో మన్మతమో లేక పరమతమో ఏదో ఒకటి కలుస్తుంది. మన్మతము అనగా ఆత్మలో తక్కువ జ్ఞానము ఉండటము వలన ఏ సంస్కారాలైతే ఉన్నాయో, వాటి అనుసారముగా ఏ సంకల్పాలైతే ఉత్పన్నమవుతాయో, అవి స్థితిని కింద-మీద చేస్తాయి. అందుకే చెక్ చేసుకోండి మరియు చెక్ చేయించుకోండి, ఒక్క అడుగు కూడా శ్రీమతానికి విరుద్ధముగా లేకపోతే, అప్పుడు పదమాల సంపాదనను జమ చేసుకుని పదమాపదమ భాగ్యశాలిగా అవ్వగలరు.

**స్లోగన్:- మనసులో సర్వుల కళ్యాణము యొక్క భావన నిలిచి ఉండటము - ఇదే విశ్వ కళ్యాణకారీ ఆత్మ యొక్క కర్తవ్యము.**

## అవ్యక్త ప్రేరణలు

### నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి

పరిస్థితులు ఎలా ఉన్నా కానీ నిశ్చయబుద్ధి కల పిల్లలు పరిస్థితులు వచ్చినప్పుడు తమ స్వ స్థితి యొక్క శక్తి ద్వారా సదా విజయులుగా అనుభవము చేస్తారు. ప్రపంచములోని వారైనా లేక బ్రాహ్మణ పరివారము యొక్క సంబంధ-సంపర్కములోని వారైనా - మిమ్మల్ని చూసి వీరు ఓడిపోయారు అని భావించినా కానీ అది ఓటమి కాదు, గెలుపు. సేవలోని పరిస్థితి అయినా, సంగఠనలోని పరిస్థితి అయినా, ప్రకృతి ద్వారా వచ్చే పరిస్థితి అయినా, అవి స్వ స్థితిని లేక శ్రేష్ఠ స్థితిని కింద-మీద చేసినట్లయితే, అది కూడా బంధనముక్త స్థితి కాదు. ఆ బంధనము నుండి కూడా ముక్తులుగా అవ్వండి.

24-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - మీరు గృహస్థ వ్యవహారములో ఉంటూ కమల పుష్ప సమానముగా పవిత్రముగా తయారవ్వాలి, ఒక్క తండ్రి మతముపైనే నడుచుకోవాలి, ఎటువంటి డిస్సర్వీస్ చేయకూడదు"**

**ప్రశ్న:-** ఏ పిల్లలపై మాయ జోరుగా తన పంజాను విసురుతుంది? పెద్ద గమ్యమేమిటి?

**జవాబు:-** ఏ పిల్లలైతే దేహాభిమానములో ఉంటారో, వారిపై మాయ జోరుగా పంజా విసురుతుంది, అప్పుడు వారు నామ-రూపాలలో చిక్కుకుంటారు. దేహాభిమానము రావడముతోనే చెంపదెబ్బ తగులుతుంది, దీని వలన పదవి భ్రష్టమైపోతుంది. దేహాభిమానాన్ని తెంచడము, ఇదే పెద్ద గమ్యము. బాబా అంటారు, పిల్లలూ, దేహీ-అభిమానులుగా అవ్వండి. ఎలాగైతే తండ్రి విధేయత కల సేవాధారిగా ఉన్నారో, ఎంతో నిరహంకారిగా ఉన్నారో, అలా నిరహంకారిగా అవ్వండి, ఎటువంటి అహంకారము ఉండకూడదు.

**పాట:-** వారు మా నుండి వేరు కారు...

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. తండ్రి సమానముగా నిరహంకారిగా అవ్వాలి. ఎవరి నుండి సేవ తీసుకోకూడదు. ఎవరికీ దుఃఖమునివ్వకూడదు. శిక్షలు అనుభవించవలసి వచ్చే విధమైన పాప కర్మలేవీ జరగకూడదు. పరస్పరము క్షీరఖండము వలె ఉండాలి.
2. ఒక్క తండ్రి యొక్క శ్రీమతముపైనే నడవాలి, స్వయము యొక్క మతముపై కాదు.

**వరదానము:- క్షణములో దేహము రూపీ వస్త్రము నుండి అతీతముగా అయ్యి కర్మభోగముపై విజయాన్ని ప్రాప్తి చేసుకునే సర్వ శక్తి సంపన్న భవ**

కర్మభోగము యొక్క తీవ్రత ఉన్నప్పుడు, కర్మేంద్రియాలు కర్మభోగానికి వశమై తమవైపుకు ఆకర్షితము చేస్తాయి అనగా ఏ సమయములోనైతే చాలా ఎక్కువ నొప్పి ఉంటుందో, అటువంటి సమయములో కర్మభోగాన్ని కర్మయోగములోకి పరివర్తన చేసేవారు, సాక్షీగా అయ్యి కర్మేంద్రియాల ద్వారా అనుభవింపచేసేవారే సర్వ శక్తి సంపన్నమైన అష్ట రత్న విజయులుగా పిలవబడతారు. దాని కోసం బహుకాలము నుండి దేహము రూపీ వస్త్రము నుండి అతీతముగా అయ్యే అభ్యాసము ఉండాలి. ఈ వస్త్రము ప్రాపంచిక ఆకర్షణ లేక మాయా ఆకర్షణ వలన టైట్‌గా అవ్వకూడదు, అప్పుడే సహజముగా వదలగలుగుతారు.

**స్లోగన్:- సర్వుల నుండి గౌరవాన్ని ప్రాప్తి చేసుకునేందుకు నిర్మానచిత్తులుగా అవ్వండి - నిర్మానత మహానతకు గుర్తు.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి**

సాకారములో ఒకవేళ ఎవరైనా నిమిత్త శ్రేష్ఠ ఆత్మ తోడుగా ఉంటే అప్పుడు ఏ విషయాన్ని అయినా వారి ద్వారా వెరిఫై చేయించుకుని, ఆ తర్వాత చేసినట్లయితే ఆ కార్యాన్ని నిశ్చయబుద్ధి కలవారిగా అయ్యి చేస్తారు. నిర్భయత మరియు నిశ్చయము, ఈ రెండు గుణాలను ఎదురుగా పెట్టుకుని చేస్తారు. కనుక ఎక్కడైతే సదా నిశ్చయము మరియు నిర్భయత ఉంటాయో అక్కడ సదా శ్రేష్ఠ సంకల్పాల విజయము ఉంటుంది. ఏ సంకల్పము చేసినా గాని, ఒకవేళ సదా నిరాకారుడు మరియు సాకారుడు తోడుగా లేక సమ్ముఖములో ఉన్నట్లయితే, వెరిఫై చేయించుకున్న తర్వాత నిశ్చయము మరియు నిర్భయతతో చేయండి, ఇలా చేస్తే సమయము కూడా వ్యర్థమవ్వదు.

25-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

## "మధురమైన పిల్లలూ - మీరు మహావీరులు, మీరు మాయా తుఫానులకు భయపడకూడదు, ఒక్క తండ్రిని తప్ప ఇంకెవ్వరినీ పట్టించుకోకుండా పవిత్రముగా తప్పకుండా అవ్వాలి"

**ప్రశ్న:-** పిల్లలలో ఏ ధైర్యము నిలిచి ఉన్నట్లయితే వారు చాలా ఉన్నతమైన పదవిని పొందగలరు?

**జవాబు:-** శ్రీమతముపై నడుస్తూ పవిత్రముగా అయ్యే ధైర్యము. ఎన్ని గొడవలు జరిగినా కానీ, కష్టాలు సహించవలసి వచ్చినా కానీ, పవిత్రముగా తయారయ్యేందుకు తండ్రి ఏదైతే శ్రేష్ఠ మతాన్ని ఇచ్చారో, దానిపై నిరంతరము నడుస్తూ ఉన్నట్లయితే చాలా ఉన్నత పదవిని పొందగలరు. ఏ విషయములోనూ భయపడకూడదు, ఏమి జరిగినా కానీ – నథింగ్ న్యూ (కొత్తేమీ కాదు).

**పాట:-** భోళానాథుని కన్నా అతీతమైనవారు...

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. సదా తండ్రి సమానముగా అయ్యే ధైర్యమును ఉంచాలి. తండ్రిపై పూర్తిగా బలిహారమవ్వాలి.
2. ఏ విషయములోనూ భయపడకూడదు. పవిత్రముగా తప్పకుండా అవ్వాలి.

### వరదానము:- సమస్యలను ఎక్కే కళకు సాధనముగా అనుభవం చేస్తూ సదా సంతుష్టముగా ఉండే శక్తిశాలీ భవ

శక్తిశాలి ఆత్మలు ఎవరైతే ఉంటారో వారు సమస్యలను ఎలా దాటివేస్తారంటే, ఏదైనా మంచిగా, నేరుగా ఉన్న దారిని సహజముగా దాటివేసినట్లు దాటివేస్తారు. సమస్యలు వారి కొరకు ఎక్కే కళకు సాధనముగా అవుతాయి. ప్రతి సమస్య తెలిసినట్లుగానే అనుభవమవుతుంది. వారు ఎప్పుడూ ఆశ్చర్యవంతులుగా అవ్వరు. సదా సంతుష్టముగా ఉంటారు. నోటి నుండి ఎప్పుడూ కారణము అన్న పదము వెలువడదు, అదే క్షణములో కారణమును నివారణలోకి మార్చివేస్తారు.

### స్లోగన్:- స్వ-స్థితిలో స్థితులై సర్వ పరిస్థితులను దాటివేయటమే శ్రేష్ఠత.

## <u>అవ్యక్త ప్రేరణలు</u>

### నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి

ఏ విధముగా డాక్టర్ ముందుగా పేషెంట్‌కు నమ్మకము కలిగిస్తారు, ఈ డాక్టర్ చాలా మంచివారు, వీరి ద్వారా ఉపశమనము లభిస్తుంది అన్న నమ్మకము కలుగుతుంది. ఒకవేళ డాక్టర్ ఎంత మంచి మెడిసిన్ ఇచ్చినా వారిపై నమ్మకము లేకపోతే ఆ మెడిసిన్ యొక్క ప్రభావము ఉండదు. అలాగే ఆత్మిక డాక్టర్‌గా అయ్యే విషయములో కూడా ఎటువంటి శక్తిశాలి స్టేజ్ ఉండాలంటే – ఇక్కడకు చేరుకున్నామంటే తప్పకుండా ఏదో ఒక ప్రాప్తి లభిస్తుంది అని అందరికీ నమ్మకము కలగాలి.

26-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - సాంగత్య దోషము నుండి రక్షించుకుని చదువుపై పూర్తిగా ధ్యానముంచినట్లయితే ఎటువంటి తుఫానులు రాలేవు, అంతేకానీ మాయను దోషిగా చేయకండి"**

**ప్రశ్న:-** ఏ ఒక్క విషయముపై సదా ధ్యానముంచినట్లయితే నావ తీరానికి చేరుతుంది?

**జవాబు:-** "బాబా, మీరు ఏది ఆజ్ఞాపిస్తే అది చేస్తాను", ఇలా సదా తండ్రి ఆజ్ఞపై నడుస్తూ ఉన్నట్లయితే మీ నావ తీరానికి చేరుతుంది. ఆజ్ఞపై నడిచేవారు మాయ దాడి నుండి రక్షింపబడతారు, బుద్ధితాళం తెరుచుకుంటుంది, అపారమైన సంతోషముంటుంది, ఎటువంటి తప్పుడు కర్మలు జరగవు.

**పాట:-** మిమ్మల్ని పొంది మేము...

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. తండ్రి, టీచర్, సద్గురువు ద్వారా ఏ శిక్షణలైతే లభిస్తాయో, వాటి అనుసారముగా నడుచుకోవాలి. మాయపై దోషము మోపకుండా తమ లోపాలను చెక్ చేసుకుని వాటిని తొలగించుకోవాలి.
2. అహంకారాన్ని త్యజించి తమ చదువులో ఆనందముగా నిమగ్నమై ఉండాలి. ఎప్పుడూ ఇతరుల నుండి సేవ తీసుకోకూడదు. సాంగత్య దోషము నుండి చాలా-చాలా సంభాళించుకోవాలి.

**వరదానము:- సంకల్పాల సూచనల ద్వారా మొత్తము కార్య-వ్యవహారాలను నడిపించే సదా ప్రకాశ కిరీటధారీ భవ**

ఏ పిల్లలైతే సదా లైట్‌గా ఉంటారో, వారి సంకల్పాలు మరియు సమయము ఎప్పుడూ వ్యర్థముగా పోవు. ఏది జరిగేది ఉందో అదే సంకల్పము కలుగుతుంది. ఏ విధముగా మాట్లాడటం ద్వారా విషయాన్ని స్పష్టము చేస్తారో, అలానే సంకల్పాల ద్వారా మొత్తము కార్య-వ్యవహారాలు జరుగుతాయి. ఎప్పుడైతే అటువంటి విధిని ఉపయోగిస్తారో, అప్పుడు ఈ సాకార వతనము సూక్ష్మవతనముగా అయిపోతుంది. దీని కోసం సైలెన్స్ శక్తిని జమ చేసుకోండి మరియు ప్రకాశ కిరీటధారిగా ఉండండి.

**స్లోగన్:- ఈ దుఃఖధామము నుండి పక్కకు వచ్చేసినట్లయితే ఎప్పుడూ దుఃఖపు అల రాలేదు.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి**

ఏ విధముగా కారులో బ్యాటరీ కొద్దిగా ఢీలా అయినప్పుడు కారు దానికి అదే నడవదు, అప్పుడు ఇతరుల చేత కారును కాస్త తోయించుకుంటారు, అలాగే ఏ ఆత్మ పైనైతే మీకు నమ్మకము ఉందో మరియు వారి ద్వారా మీకు సహాయము లభించగలదు అని అనిపిస్తుందో, వారి నుండి కాస్త సహయోగాన్ని తీసుకుని ముందుకు వెళ్ళిపోవాలి. బలహీనతకు సంబంధించిన విషయాన్ని ఎక్కువగా ఆలోచించకండి, అప్పుడు సంతోషములో ముందుకు వెళ్తూ ఉంటారు.

27-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - జ్ఞాన సాగరుడైన తండ్రి ద్వారా మీరు మాస్టర్ జ్ఞానసాగరులుగా అయ్యారు, మీకు జ్ఞానము యొక్క మూడవ నేత్రము లభించింది, అందుకే మీరు త్రినేత్రులు, త్రికాలదర్శులు మరియు త్రిలోకనాథులు"**

**ప్రశ్న:-** విశ్వము యొక్క ఆత్మిక సేవను పిల్లలైన మీరు తప్ప ఇతరులెవ్వరూ చేయలేరు- ఎందుకు?

**జవాబు:-** ఎందుకంటే మీకు మాత్రమే సుప్రీమ్ ఆత్మ (శివబాబా) యొక్క శక్తి లభిస్తుంది. మొదట ఆత్మలైన మీకు సుప్రీమ్ ఆత్మ ద్వారా జ్ఞానపు ఇంజెక్షన్ వేయడము జరుగుతుంది, దీని ద్వారా మీరు 5 వికారాలపై స్వయము కూడా విజయాన్ని పొందుతారు మరియు ఇతరులను కూడా విజయము పొందేలా చేస్తారు. ఇటువంటి సేవను ఇతరులెవ్వరూ చేయలేరు. కల్ప-కల్పము పిల్లలైన మీరు మాత్రమే ఈ ఆత్మిక సేవను చేస్తారు.

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. తండ్రి శ్రీమతముపై నడుస్తూ సత్యాతి-సత్యమైన ఆత్మిక సేవను చేయాలి. సర్వశక్తివంతుడైన తండ్రి నుండి శక్తిని తీసుకుని 5 వికారాల రూపీ శత్రువులపై విజయము పొందాలి.
2. మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు పవిత్రముగా తప్పకుండా అవ్వాలి. జ్ఞానాన్ని ధారణ చేసి ముళ్ళ నుండి పుష్పాలుగా తయారవ్వాలి మరియు తయారుచేయాలి.

**వరదానము:- వినాశన సమయములో పరీక్షలో పాస్ అయ్యే ఆకారీ లైట్ రూపధారీ భవ**

వినాశన సమయములో పరీక్షలో పాస్ అయ్యేందుకు లేక సర్వ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆకారీ లైట్ రూపధారులుగా అవ్వండి. ఎప్పుడైతే మీరు నడుస్తూ-తిరుగుతూ ఉన్న లైట్ హౌస్‌లుగా అయిపోతారో అప్పుడు మీ ఈ రూపము (శరీరము) కనిపించదు. ఏ విధముగా పాత్రను అభినయించే సమయములో వస్త్రము (శరీరము)ను ధారణ చేస్తారో, కార్యము సమాప్తము కావటముతోనే వస్త్రాన్ని విడిచిపెడతారో, అలా ఒక్క క్షణములో ధరించండి, ఒక్క క్షణములో అతీతులుగా అయిపోండి – ఎప్పుడైతే ఇటువంటి అభ్యాసము ఉంటుందో అప్పుడు చూసేవారు వీరు ప్రకాశ వస్త్రధారులు, ప్రకాశమే వీరి అలంకారము అని అనుభవము చేస్తారు.

**స్లోగన్:- ఉల్లాస-ఉత్సాహాలనే రెక్కలు సదా తోడుగా ఉన్నట్లయితే ప్రతి కార్యములోనూ సఫలత సహజముగా లభిస్తుంది.**

**<u>అవ్యక్త ప్రేరణలు</u>**

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి**

బాబా సర్వశక్తివంతుడు కావున వారి చేతిని పట్టుకున్నవారు తప్పకుండా చేరుకుంటారు అన్న నమ్మకము పెట్టుకోండి. స్వయము బలహీనముగా ఉన్నా కానీ సహచరుడైతే శక్తిశాలిగా ఉన్నారు కదా, అందుకే తప్పకుండా దాటివేస్తారు. నేను నిశ్చయబుద్ధి విజయీ రత్నాన్ని అని సదా ఈ స్మృతిలోనే ఉండండి. గతం గతః, బిందువును పెట్టి ముందుకు వెళ్ళిపోండి.

28-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

## "మధురమైన పిల్లలూ - ప్రతి ఒక్కరి పాపాలను పీల్చేటువంటి ఫస్ట్ క్లాస్ బ్లాటింగ్ పేపర్ ఒక్క శివబాబా మాత్రమే, వారిని స్మృతి చేసినట్లయితే పాపాలు సమాప్తమైపోతాయి"

**ప్రశ్న:-** ఆత్మపై ఏర్పడిన అన్నింటికన్నా గాఢమైన మచ్చలు ఏమిటి, వాటిని తొలగించేందుకు ఎటువంటి కృషిని చేయాలి?

**జవాబు:-** ఆత్మపై దేహాభిమానము యొక్క చాలా గాఢమైన మచ్చలు ఏర్పడ్డాయి, పదే-పదే ఎవరో ఒక దేహధారి నామ-రూపాలలో చిక్కుకుంటూ ఉంటుంది. తండ్రిని స్మృతి చేయకుండా దేహధారులను స్మృతి చేస్తూ ఉంటుంది. ఇతరుల మనసుకు దుఃఖం కలిగిస్తూ ఉంటుంది. ఈ మచ్చలను తొలగించుకునేందుకు దేహీ-అభిమానులుగా అయ్యే కృషి చేయండి.

**పాట:-** ముఖాన్ని చూసుకో ప్రాణీ...

**ధారణ కొరకు ముఖ్య సారము:-**

1. ఎప్పుడూ కూడా ఎవరి హృదయానికి దుఃఖము కలిగించకూడదు. అందరికీ సుఖాన్ని ఇవ్వాలి. ఒక్క తండ్రి స్మృతిలోనే ఉండాలి మరియు అందరికీ స్మృతిని ఇప్పించాలి.
2. పాపాల మచ్చలను తొలగించుకునేందుకు దేహీ-అభిమానులుగా అయి అవినాశీ బ్లాటింగ్ పేపర్ అయిన తండ్రిని స్మృతి చేయాలి. ఎటువంటి మధురమైన అవస్థను తయారుచేసుకోవాలంటే, అందరి కళ్యాణము జరుగుతూ ఉండాలి.

**వరదానము:- తమ శ్రేష్ఠత ద్వారా నవీనతా జెండాను ఎగురవేసే శక్తి స్వరూప భవ**

ఇప్పుడు సమయమనుసారముగా, సమీపత అనుసారముగా శక్తి రూపము యొక్క ప్రభావాన్ని ఇతరులపై కలిగించినప్పుడు అంతిమ ప్రత్యక్షతను సమీపముగా తీసుకురాగలుగుతారు. ఏ విధముగా స్నేహాన్ని మరియు సహయోగాన్ని ప్రత్యక్షము చేసారో అదే విధముగా సేవ అనే అద్దములో శక్తి రూపాన్ని అనుభవము చేయించండి. ఎప్పుడైతే మీ శ్రేష్ఠత ద్వారా శక్తి రూపపు నవీనతా జెండాను ఎగురవేస్తారో అప్పుడు ప్రత్యక్షత జరుగుతుంది. మీ శక్తి స్వరూపము ద్వారా సర్వశక్తివంతుడైన తండ్రిని సాక్షాత్కారము చేయించండి.

**స్లోగన్:- మనసు ద్వారా శక్తులను మరియు కర్మల ద్వారా గుణాలను దానము చేయటమే మహాదానము.**

## అవ్యక్త ప్రేరణలు

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి**

తండ్రికి పిల్లలపై ఈ పూర్తి విశ్వాసము ఉంది - నా ఈ పిల్లలే విఘ్న వినాశక ఆత్మలు, పూజ్య ఆత్మలు, ఈ పిల్లలు తండ్రి కన్నా ముందున్నారు, ఈ పిల్లలు నిమిత్తముగా ఉన్నారు, వీరు సదా తండ్రిని కూడా నిశ్చింత చేసేవారు, సదా శుభవార్తను వినిపించేవారు, వీరిలోని ప్రతి ఒక్కరూ విశేషమైనవారే. స్వయముపై కూడా ఇటువంటి విశ్వాసము పెట్టుకుని ఇదే స్మృతి స్వరూపములో ఉన్నట్లయితే విజయులుగా అవుతారు.

"మురళి సారము"

29-03-26 ప్రాతః మురళి ఓంశాంతి "అవ్యక్తబాప్‌దాదా" రివైజ్-25-10-2009 మధువనం

## "సర్వ ఖజానాలతో సంపన్నముగా ఉన్న మీ ముఖము మరియు నడవడికతో అలౌకికతను సాక్షాత్కారము చేయించండి"

- ❖ ఈ రోజు సర్వ ఖజానాల దాత ఖజానాలకు యజమానులైన తమ పిల్లలను చూస్తున్నారు. పిల్లలు ప్రతి ఒక్కరూ సర్వ ఖజానాలతో సంపన్నముగా ఉన్నారు.
- ❖ ఖజానాలతో సంపన్నముగా ఉన్న మీ ముఖము ద్వారా మరియు నడవడిక ద్వారా మీలోని అలౌకికత దూరము నుండే సాక్షాత్కారమవుతుంది. ఇప్పుడు మీరు ఇటువంటి పురుషార్థాన్ని ప్రత్యక్షము చేయండి.
- ❖ మీరే మీ చార్టు పెట్టుకోండి మరియు ప్రతి రోజు రాత్రి బాప్‌దాదాకు మీ రోజంతటి చార్టును వినిపించిన తర్వాత మీ బుద్ధిని ఖాళీ చేసుకుని పడుకోవడము వలన మీకు నిద్ర కూడా చక్కగా పడుతుంది మరియు రోజంతటి స్థితిగతులను వినిపించడము వలన మరుసటి రోజు – మేము బాబాకు మా గురించి నిన్న వినిపించాము కదా అని గుర్తుకువస్తుంది, ఆ స్మృతి సహయోగము ఇస్తుంది.
- ❖ ఇప్పుడు రెండు విషయాలను గుర్తుంచుకోండి – మాయకు గెట్ అవుట్ అని సైగ చేయండి మరియు స్వయాన్ని గెస్ట్ హౌస్‌లో ఉన్నట్లు అనుభవము చేయండి. ఈ ప్రపంచము మీది కాదు, ఇది గెస్ట్ హౌస్, ఇప్పుడిక ఇంటికి వెళ్ళాల్సిందే.
- ❖ ఈ అనంతమైన వైరాగ్యము మనసులోని ఏ విధమైన సంకల్పాలనైనా, పరస్పర సంగఠనలో వచ్చే మాయా విఘ్నాలనైనా పూర్తిగా సమాప్తము చేసేస్తుంది. ఈ మాయా తుఫానులు మీ కొరకు తోఫాగా (కానుకగా) అవుతాయి. ఇప్పుడు అనంతమైన వైరాగిగా అవ్వాలి అన్న లక్ష్యము పెట్టుకోండి, మరియు ధైర్యము మరియు ఉల్లాస-ఉత్సాహాల రెక్కలతో ఎగురుతూ ఉండండి మరియు ఎగిరేలా చేస్తూ ఉండండి. ఇప్పుడు ఇది ఎగిరే సమయము.

**వరదానము:- తమ శ్రేష్ఠ వృత్తి ద్వారా శుద్ధ వాయుమండలాన్ని తయారుచేసే సదా శక్తిశాలీ ఆత్మా భవ**

ఎవరైతే సదా తమ శ్రేష్ఠ వృత్తిలో స్థితులై ఉంటారో వారు ఎటువంటి వాయుమండలములోనైనా, వైబ్రేషన్లలోనైనా అలజడికి లోనవ్వరు. వృత్తి ద్వారానే వాయుమండలము తయారవుతుంది. ఒకవేళ మీ వృత్తి శ్రేష్ఠమైనదైనట్లయితే వాయుమండలము శుద్ధముగా అవుతుంది. కొంతమంది ఏమని వర్ణిస్తారంటే – ఏం చేయాలి, వాయుమండలమే అలా ఉంది, వాయుమండలము కారణముగా నా వృత్తి చంచలమయ్యింది అని అంటుంటారు, అంటే ఆ సమయములో శక్తిశాలీ ఆత్మకు బదులుగా బలహీన ఆత్మగా అయిపోతున్నారు. కానీ వ్రతము (ప్రతిజ్ఞ) యొక్క స్మృతితో వృత్తిని శ్రేష్ఠముగా తయారుచేసుకున్నట్లయితే శక్తిశాలిగా అయిపోతారు.

**స్లోగన్:- గుణమూర్తులుగా అయ్యి సర్వులను గుణమూర్తులుగా తయారుచేయటమే మహాదానిగా అవ్వటము.**

### <u>అవ్యక్త ప్రేరణలు</u>

**నిశ్చయమనే పునాదిని దృఢముగా చేసుకుని సదా నిర్భయులుగా మరియు నిశ్చింతగా ఉండండి**

పరస్పరములో ఒకరి పట్ల ఒకరికి సత్యమైన స్నేహము ఉండాలి, స్నేహీ ఆత్మ పట్ల ఎప్పుడూ అనుమానము ఉత్పన్నమవ్వదు. వారి స్నేహపూర్వకమైన మాటలు సాధారణముగా ఉన్నా కూడా ఫీల్ అవ్వరు, వారి తేలికపాటి మాటలు కూడా ఎలా అనిపిస్తాయంటే తప్పకుండా వీరు ఏదో అర్థముతో అనుంటారు అని అనిపిస్తుంది. అవి అర్థం లేనివిగా, వ్యర్థమైనవిగా అనిపించవు. ఎక్కడైతే స్నేహము ఉంటుందో, అక్కడ నమ్మకము తప్పకుండా ఉంటుంది. కావున బ్రాహ్మణ పరివారములో ఒకరి పట్ల మరొకరు ఇంతటి స్నేహాన్ని మరియు నమ్మకాన్ని పెట్టుకుని సంపూర్ణ నిశ్చయబుద్ధి కలవారిగా అవ్వండి, అప్పుడు బ్రహ్మాబాబా ఆశలను పూర్తి చెయ్యగలరు.